## కథ

**ప్రఫుల్లచంద్ర**

# వెరైటీ సినిమా

**టీవీలో 'మా గోల' కార్యక్రమం వస్తోంది. రాబోయే తమ చెత్తరాజం (సారీ, చిత్రరాజం) గురించి నిర్మాత, దర్శకులతో బాటు మరికొందరు దప్పుకొట్టి అర్జెంట్‌గా సినిమా చూసెయ్యమని కోరుతారన్నమాట. అర్జెంట్‌గా చూడకపోతే సిన్మా దబ్బాలు మర్నాడే తిరిగొచ్చేసి ఆ తర్వాత చూద్దామన్నా సినిమా ఉండదని వాళ్ళ బెంగ.**

బంబా ఉరఫ్ బంగారుబాబు, రంబా ఉరఫ్ రాంబాబు టీవీ ఎదుట కూలబడి మాగోల వింటూ, చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

బంబాకి రెండు విషయాలు బాగా తెలుసు-తండ్రి సంపాదించి పోయిన ఆస్తి తగలెట్టడం, సినిమా చీమ చిటుక్కుమంటే ఆ చిటుక్కు అర్థం ఏమిటో వివరించడం! మరి రంబాకు అన్నీ అనుమానాలే. అన్నీ శంకలే. అందుకని అతని ముద్దుపేరు నిశంబా (నిత్యశంకలబాబు)!

'మాగోల'లో నిర్మాత నిమ్మకాయల మీసాలప్పమర్నాడు విడుదల అయే తన చిత్రం 'చీకట్లో చిన్నది' కింద క్యాప్షన్ 'నా మొగుడెవరు?' గురించి డప్పు వేస్తున్నాడు.

''మాది వెరైటీ చిత్రం. వెరైటీ కథ. అందరూ అలాగే చెబుతారని చప్పరించకండి. చూస్తే మీరే అంగీకరిస్తారు. వెరైటీ చిత్రం అని. చూడండి. విడుదల రోజే చూడండి''

''ఏం మర్నాడు సినిమా ఉండదా?'' కిసుక్కున శంకించాడు రంబా.

ఆ తర్వాత చిత్ర దర్శకుడు దిష్టికళ్ళ దిరుగుండం-ఇది తన మొదటి చిత్రం అనీ, ప్రేక్షకులు వెరైటీగా ఆదరించి ఆశీర్వదించాలనీ ఏడ్చుకున్నాడు. తర్వాత ఫైట్ మాస్టర్ - ఈ చిత్రంలోని వెరైటీ ఫైట్‌లు గతంలో రాలేదు. మళ్ళీ రావు- అని గద్దించాడు.

హీరో సంజు హిందీ కుర్రాడు. హీరోయిన్ మంజు మళయాళీ. ఇద్దరికీ యిది మొదటి చిత్రమే. తప్పక చూడండి బాబూ. లేకుంటే మాకు రెండో చిత్రమే ఉండదు. ఇంగ్లీషు చిలకల్లాగ మొత్తుకున్నారు వాళ్ళు.

మొదటిరోజు మొదటి ఆట చూసెయ్యడానికే సాహసించారు బంబా, రంబాలు. అయితే థియేటర్ వద్ద పెద్దగా జనం లేరు. బహుశా-రష్‌లో ప్రాణాలు పోవచ్చని భయపడి జనం రాలేదు కాబోలు. చిప్స్, చాటింగ్‌తో చివరి వరుస కుర్చీల్లో కూలబడ్డారు మిత్రులు.

సినిమా ప్రారంభం.

జలపాతం..కింద కొలను..బండలూ,

అదేదో సబ్బు ప్రకటనలాగా జలపాతం కింద హీరోయిన్ మంజు జలకాలాడుతూ కాళ్ళూ చేతులూ తపతపలాడిస్తూంటే అంత దూరం నుంచి చూస్తున్నాడు హీరో సంజు మంజు ఛాతికడ్డంగా ఒక పీలిక, నడుం చుట్టూ మరో పీలిక కట్టుకొని బండమీద నడుం వాల్చింది అదో ఫోం బెడ్ అయినట్టు. ఆమె అందం చూసి కిర్రెక్కిన చేపపిల్లలు అటునుంచి యిటు గిరికీలు కొడుతోంటే ఒక తుంటరి చేప చక్కలి గిలి పెట్టింది. అది చూసి ఒక బల్లి చేప పిల్లను తగిలేసి బొడ్డుమీద తనే సెటిల్ అయిపోయింది. భయపడకుండా మంజు పొట్టను అటూ యిటూ ఆడిస్తూ హమ్మింగ్ చేస్తోంది. సంజు పాట అందుకున్నాడు.

ఓ పాతికమంది యూనిఫాంలో అక్కడ తగలబడి వంత డాన్స్ మొదలుపెట్టారు.

మంజు వాళ్ళ చేతుల మీదుగా దొర్లింది. భుజాలెక్కి కూర్చుంది. ఛాతితో ఢీ కొట్టి కాళ్ళ మధ్య నుంచి దూరి బయటకొచ్చి హీరోకి కన్నుకొట్టింది.

''వాళ్ళ చేతుల్లో నలిగిపోయి, అలా వాళ్ళ భుజాలెక్కిన ఈ గుణసుందరిని నువ్వు పెళ్ళి చేసుకుంటావా? అసలు అలాంటి పిల్ల సవ్యంగా కాపురం చేస్తుందా?'' నిశంబాకి అనుమాన మొచ్చింది.

''నోర్ముయ్! ఇది సినిమా..అంటే కల్పన!'' కసిరాడు బంబా.

''ఎంత కల్పన అయినా ఔచిత్యం ఉండాలి కదా! కొబ్బరిచెట్టుకు కోకాకోలా సీసాలు గుత్తులు గుత్తులు వేలాడుతున్నట్లు చూపిస్తే జనం హర్షిస్తారా?'' మరో శంక.

నోరు ఖాళీగా వుంటే ఇలాంటి శంకలే దూసుకొస్తాయని అతని నోటిలో చిప్స్‌పాకెట్ కుక్కాడు బంబా. అంతలో తెరమీద మరో వెరైటీ-

ఆటా పాటా అయాక గ్రూప్ డాన్సర్‌ల లోని గుంజూ ముందుకొచ్చి మంజు భుజం మీద చెయ్యి వేసి ''ఈ చినదానితో చీకట్లో చేయాల్సిన పని ఒకటుంది. నువ్వు తప్పుకో'' అని హీరోతో అన్నాడు.

''టార్, నేను హీరోని, అది హీరోయిన్. దానితో పని ఉండేది నాకే గాని నీకు కాదు'' అరిచాడు సంజు.

''నీతో సమానంగా నేనూ ఆడాను, పాడాను. హీరోయిన్‌లో కసికసిగా నువ్వు చూసిన అందాలన్నీ నేనూ చూశాను. నీ గుండె లబ్‌డబ్ మంటే నా గుండె లవ్ లవ్ అంటోంది. ఏంటంటా నీ గొప్పదనం! నీకున్నదీ నాకు లేనిదీ ఏమిటంటా?'' అంటూ నడుం వెరైటీగా ఊపాడు.

ఆ ఊపులో ఏం కనిపించిందో, ఏం అనిపించిందో-నేల క్లాసులో వున్న నలుగురూ ఈలలూ చప్పట్లతో హర్షించారు.

వాళ్ళు ఈలలు వేసినందుకు కాదుగానీ గుంజు ధిక్కార ధోరణిని సహించలేని సంజు కొండశిఖరం మీదకు హైజంప్ చేసి అక్కడున్న బండని కిందకు తోశాడు. అది కిందకు దొర్లుకుంటూ, దొర్లుకుంటూ వచ్చి సగంలో ఆగిపోయింది.

రంబా నోటిలో బంబా కుక్కిన చిప్స్ బాగానే పనిచేశాయి. ఎందుకంటే-

ఎదురుగా వున్న గుంజుని చాచి కొట్టే బదులు హీరో కొండెక్కి బండ తోయడం ఎందుకు? అని అడగబోయిన రంబా నోరు ఖాళీగా లేక అడగలేక అదో వెరైటీ కాబోలు అని సమాధానపడ్డాడు.

అంతలో గుంజు కూడా హైజంప్ చేసి హీరోప్రక్కన నిలబడి తనూ ఒక బండ తోశాడు. అది దొర్లుతూ పోయి ఆగివున్న సంజు బండకి కిస్ యిచ్చింది. అంతే. రెండూ పిండి పిండి అయిపోయాయి.

ఊడలతోబాటు కత్తులు కూడా మొలిచిన మర్రిచెట్టు వద్దకు పరుగు తీసి ఒక కత్తి పీకాడు సంజు-గుంజు కూడా డిటో.

వాళ్ళిద్దరూ కత్తియుద్ధం చేస్తూవుంటే, వెనక డమరుకం, రాండోలు, మృదంగం మార్మోగుతూండగా రెండు కత్తులూ సగానికి విరిగిపోయాయి. మర్రిచెట్టు నుంచి మరో రెండు కత్తులు

పీకి మళ్ళీ యుద్ధానికి తలపడగా వెనక వీణ, సితార, ఫిడేలు రాగాలు! ఆ కత్తులూ విరిగాయి. మ(రిచెట్టుకు కాసిన కత్తులన్నీ అయిపోయాయి.

సంజు పరుగున వెళ్ళి మ(రిచెట్టు కిటు (ప్రక్కనున్న మునగ చెట్టెక్కాడు. అతని ఆవేశాన్ని ఆ(గహాన్నీ తట్టుకోలేక మునగ చెట్టు విరిగి సంజుతోబాటు గుంజమీద పడింది. ఆ చెట్టుని అంటిపెట్టుకొని వున్న గొంగళి పురుగుల వర్షం కురిసింది యిద్దరి మీదా. వెంటనే వాళ్ళు షర్ట్‌లు విప్పి పారేసి చెరొక మునగకాడ పీకి వాటితో కత్తియుద్ధం (ప్రారంభించారు. మునగకాడల దెబ్బలకు వాళ్ళ శరీరాలు చీరుకుపోయి రక్తం ధారలు కట్టింది.

మునగకాడలన్నీ అయిపోగా పొట్లకాయలు వేలాడుతున్న పందిరిలో దూరారు యిద్దరూ. పొట్లకాయలతో కొరడాల మాదిరిగా ఛెళ్ళు ఛెళ్ళున కొట్టుకున్నారు. మరింత రక్తం. పొట్లకాయలన్నీ అయిపోయినా గెలుపెవరిదో తేలలేదు. ఇంక యిద్దరూ ముష్టి యుద్ధం (ప్రారంభించారు. ఢిషుం, ఢిషుం శబ్దాల బదులు తుస్సుం తుస్సుం శబ్దాలు!

హైదరాబాద్‌లో వున్న మంజు తల్లిదం(డులు ఆ శబ్దాలు విని విమానంలో వచ్చేసి సంగతి తెలుసుకున్నారు. బల్లి శా(స్త్రం వివరించారు.

బొడ్డుమీద బల్లి పడితే కట్టుకున్న వాడు కార్యానికి ముందే చస్తాడు. ఎంత మందిని కట్టుకున్నా అందరికీ అదే గతి. ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా నువ్వు కన్యగానే మిగిలిపోతావ్. అందువల్ల దోషనివారణకు కంచివెళ్ళి బంగారుబల్లిని ముట్టుకో. అప్పుడు మొదటివాడు చచ్చినా రెండో వాడు ఢోకాలేకుండా జీవిస్తాడు. తరుణోపాయం సెలవిచ్చింది అమ్మ. అయితే-

గుంజుకి డబ్బుంది, గ్లామర్ లేదు. సంజుకి డబ్బు లేదు, కండలూ, గ్లామరూ ఉంది. ఇద్దరికీ బుద్ధి లేదు. ఎవర్ని ఎంచుకోవాలి? ఎవర్ని కాదనాలి? ఎవరికి ఫస్ట్ చాన్స్? ఎవరికి సెకెండ్? ఎటూ తేల్చుకోలేని కూతురికి తల్లిదం(డులే ఉపాయం చెప్పారు.

''ముగ్గురూ కలిసి కంచికి వెళ్ళండి. దారిలో వాళ్ళిద్దరికీ పరీక్షలు పెట్టు. తక్కువ మార్కులొచ్చిన వాడిని ముందుగా పెళ్ళి చేసుకో. వాడు చచ్చాక రెండోవాడిని చేసుకొని సుఖించు'' అని చెప్పేసి విమానం ఎక్కి వెళ్ళిపోయారు.

ఎవరు నా మొగుడు, వీడా? వాడా? నా మొగుడెవరమ్మా? అని మంజు పాడుకుంటూ పైకి చూడగా-హెలికాప్టర్ కాళ్ళు పట్టుకొని వేలాడుతున్న సంజు, అతని కాళ్ళు పట్టుకొని వేలాడుతున్న గుంజు కనిపించారు. ఆమె పాట కర్ణభేరిని మోగించగా తలతిరిగి సంజు పట్టు వదిలేయగా ఇద్దరూ మంజు ఎదుట పడ్డారు.

''ఎవరు, ఎవరు, నా మొగుడెవరు?'' గంగ వె(రులెత్తినట్లు మంజు స్నేక్ డాన్స్ చేస్తుండగా..ఇంటర్వల్.

బయటకెళ్ళి అరడజను పాప్‌కార్న్ ప్యాకెట్లు కొనుక్కొచ్చాడు బంబా.


ఇంటర్వల్ తర్వాత సినిమా (ప్రారంభం..సీను..అదే జలపాతం.

రక్తం మరకల్ని కడుక్కోడానికి జలపాతం కింద దూరిన సంజు, గుంజులు మంజుని కూడా తమ మధ్యకు లాక్కుని పాట మొదలుపెట్టారు.

మొదటి చరణం సంజు మంజు- రాజకుమారుడు, దేవకన్య వేషంలో పాడుకున్నాక రెండో చరణం వనకన్య, అడవివీరుడు మేకప్‌తో మంజు గుంజు కంటిన్యూ చేసి ఒక జంట తర్వాత మరో జంటగా పాట పూర్తి చేశాక-

నోరు ఖాళీ అవడంతో రంబా అడిగాడు ''ఎవరైనా జాబిల్లిని ఆహ్వానిస్తూ పాడుతారు. కానీ ఈ హీరోగారేమి(టా- జాబిల్లీ, పోపో అన్నట్లు చేతులు ఊపుతున్నాడు?''

''నీ నోట్లో పాప్‌కార్న్ కొట్టా! గొప్ప అనుమానమే! ఆ హీరోకి తెలుగు అర్థం కాదు. జా అంటే పొమ్మని, బిల్లీ అంటే పిల్లి అనీ అర్థం చేసుకొని జాబిల్లీ అంటే పోవే పిల్లీ అని ఊహించి అలా నటించాడు!'' వివరించి పాప్‌కార్న్ ప్యాకెట్ అతని నోట్లో కుక్కాడు బంబా.



★ ★ ★

సంజు, గుంజులతో మంజు కంచికి బయలుదేరింది. ట్రెయిన్ నిండా జనం క్రిక్కిరిసి ఉన్నా వీళ్ళు ముగ్గురూ కూర్చున్న చోట మాత్రం ఎవరూ లేరు. బండి విజయవాడ ఐదో నంబర్ ప్లాట్ ఫాం మీద ఆగగా టీ కావాలని గోముగా అడిగింది మంజు.


ఐదు నుంచి ఒకటో నంబర్ ప్లాట్ ఫాం మీదకు చెంగున దూకి ప్లాస్టిక్ కప్పులో టీ తెచ్చాడు సంజు. కానీ గుంజు అదే ప్లాట్ ఫాం చివరనున్న టీ స్టాల్ వద్ద కుండలో మూడు టీలు పోయించుకొని అమృతభాండం తెస్తున్న గరుత్మంతుని పోజులో ఎగిరి వచ్చాడు.

సంజు సాహసానికి ఒక మార్కు, గుంజు కుండభక్తికి ఒక మార్కు వేసింది మంజు.

ట్రెయిన్ యిలా బయలుదేరి అలా వంతెనెక్కిందాం అని కింద నదిలో కూలిపోగా ముగ్గురూ పడవలో పడ్డారు. కొంతదూరం వెళ్ళాక పడవకు చిల్లు పడి నీళ్ళు లోనికి వచ్చేస్తోంటే ఆ చిల్లులో గుంజు వేలు దూర్చి నీళ్ళు రాకుండా, పడవ మునిగిపోకుండా గొప్ప త్యాగం చేయగా జోరుగా పడవ నడిపి ఒడ్డుకు చేర్చి సాహసం ప్రదర్శించాడు సంజు.

## నేనెప్పుడూ రెడీ

**కొంతమంది తారలు ఏది పట్టినా బంగారం అవుతుంటుంది. షారూక్‌ఖాన్‌ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 'ఈమధ్య నాకు సక్సెస్‌లు బాగా వస్తున్నాయి. మిగతావారితో పోలిస్తే నా సక్సెస్ రేట్ బాగుంది. అయితే ఇలాంటి టైంలోనే నటుల బాధ్యత పెరుగుతుంది. సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలతో కూడిన చిత్రాల్లో నటించే అవకాశం వెదుక్కోవాలి. ఇతర నటులకి స్ఫూర్తినిచ్చేలా ఉండాలి. జనాల్ని మెప్పించడానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను' అంటున్నాడు షారూక్.**




ఇద్దరికీ చెరొక మార్కు!

తర్వాత జట్కాలో బయలుదేరగా పిల్లి అడ్డు వచ్చింది. గుర్రం సడన్ బ్రేకు వేసి ఆగింది గాని ఆ వేగాన్ని అదుపు చేయలేక నేలకూలి చచ్చింది! పొదలో దూరిన పిల్లి నవ్వుకుంది!

గుర్రం స్థానంలో నిలబడి సంజు బండిని లాగుతూ కండబలం ప్రదర్శించగా వెనక నుంచి బండిని ముందుకు నెట్టుతూ గుంజు తన హృదయ వైశాల్యాన్ని ప్రదర్శించాడు.

ఇద్దరికీ మళ్ళీ చెరొక మార్కు.

ఇలా దారి పొడవునా సాహసాలు త్యాగాలూ చేసుకుంటూ, కండలూ హృదయ వైశాల్యాలూ ప్రదర్శించుకుంటూ మధ్య మధ్య పాటలు పాడుకుంటూ ఆరు రీళ్ళు గడిచాక కంచి చేరుకున్నారు. కాని సంజు గుంజులకు సమానంగా మార్కులొచ్చాయి.

మంజు గుంజాటనలో పడిపోయింది.

తను మొదట పెళ్ళి చేసుకోవలసిన సచ్చినోడు ఎవరు? తన అసలు మొగుడెవరు? ఎవరు? ఎవరు??

మంజు తల బొంగరంలాగా గిరగిరా తిరిగి పోతున్నది.

పరిష్కారం చూపమని కామాక్షిదేవిని వేడుకుంటూ ప్రేక్షకుల చెవులు బద్దలయేట్టు డిటియస్ సౌండ్‌తో తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పాట అందుకుంది మంజు.

మరి ఆ దేవత ఏ భాషను అర్థం చేసుకుందోగాని మంజు చేతిలో పువ్వుపడింది!

''పువ్వు పడేసి కరుణించావా కమాక్షి తల్లీ!'' అని అరుస్తూ చెంగు చెంగున గంతులేస్తూ మంజు బంగారు బల్లి ఉన్న చోటకి పరిగెత్తింది.

ఆమె బల్లిని యిలా తాకిందో లేదో వెయ్యి వాట్‌ల షాక్ తిని వెనకనున్న గుంజు మీద ఎగిరిపడింది. అతగాడు సంజు మీద విరుచుకుపడ్డాడు.

అంతే మరుక్షణం కరెంట్ పోయింది. కరెంట్ దీపాలతోబాటు ప్రమిదలూ, కాగడాలూ ఆరిపోయాయి.

చిమ్మచీకటి..గాఢాంధకారం..

కళ్ళు పీక్కున్నా ఏమీ కనిపించడం లేదు.అంతలో మెరుపు. ఆ కాంతిలో- మంజు పైకి ఎగిరిపోతున్నట్లు కనిపించింది. మళ్ళీ చీకటి.

మంజు గాలిలో తేలిపోతూ, పైపైకి ఎగిరిపోతూ ఆకాశం దాటి, రోదసి దాటి, నభోంతరాళం దాటి మళ్ళీ మెరుపు మెరిసేసరికి మరోగ్రహంలో కూలిపోయింది.

మళ్ళీ గాఢాంధకారం తర్వాత మెరుపు.

ఏవో రెండు ఆకారాలు మెరుస్తూ భూమ్మీదకు జారిపోతూ జారిపోతూ వెండి తెరను ఢీ కొని రెండు అక్షరాలుగా రూపుదిద్దుకున్నాయి. ఆ అక్షరాలు...భశుం!

థియేటర్‌లో లైట్లు వెలిగాయి.

''ఇదేం సినిమా! ఇదేం ముగింపు!!'' పాప్‌కార్న్ అయిపోవడంతో నోరు తెరిచాడు రంబా.

''వెరైటీ సినిమా. వెరైటీ ముగింపు'' క్లుప్తంగా చెప్పాడు బంబా.

ఉన్నకొద్దిమంది ప్రేక్షకులూ సినిమా అయిపోయినందుకు సంతోషంగా బయటపడ్డారు. కాని మెయిన్‌గేటు మూసి ఉండడంతో పోర్టికోలో ఆగిపోయారు. టీవీ చానల్ వాళ్ళు అభిప్రాయ సేకరణ చేస్తోంటే వాళ్ళ ఉత్సాహం ఇనుమడించింది.

''సూపర్..వంద రోజులు గ్యారంటీ..మొదటి సినిమా అయినా సంజు, మంజు గొప్పగా నటించారు. జాతీయ అవార్డు తప్పదు..'' పొగడ్తల వరద!

''వెరైటీ సినిమా అని ప్రచారం చేసినందుకు వెరైటీగానే ఉంది'' బంబా అభిప్రాయం.

''ఇంత ఖంగాళీ సినిమా నేనెప్పుడూ చూడలేదు. చివరకు శుభం కార్డు కూడా సరిగా తీయలేకపోయారు'' బాపుగారి కార్టూన్ స్టయిల్లో కుండ బద్దలు గొట్టాడు రంబా.

సినిమా సూపర్‌హిట్ అయిందని పేర్కొంటూ ప్రజాభిప్రాయం చూపిస్తున్నాడు. యాంకరుడు. మర్నాడు టీవీలో..

''సూపర్..వంద రోజులు గ్యారంటీ'' మళ్ళీ వరద ప్రారంభం. రంబా అభిప్రాయం మాత్రం కట్. కార్యక్రమం చివర నిర్మాత కనిపించి చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పి ''కావాలనే ముగింపు వెరైటీగా తీశాం. మంజు మొదటి మొగుడెవరు? రెండో మొగుడెవరు? మీరే నిర్ణయించి వారంలోగా పంపండి. ఎక్కువమంది నిర్ణయించిన ప్రకారం ముగింపు మార్చుతాం. మీకు వెరైటీ బహుమతులిస్తాం'' అని ప్రకటించాడు.

''ఆ వెరైటీ బహుమతులు ఏవైవై ఉంటాయి?'' ఈసారి శంక బంబాది!

''బుర్రలు బద్దలు గొట్టుకోడానికి సుత్తి, గద లాంటివి యిస్తారు కాబోలు'' స్నేహితుని శంక తీర్చాడు రంబా.అయితే ప్రేక్షకులు తమ నిర్ణయం రాసి పంపేలోగానే చీకట్లో చిన్నది థియేటర్లు వదిలి పారిపోయింది! వెరైటీగా!